నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, బుధవారం 20 మార్చి 2024 | SURYAPET

## సజావుగా హిందీ పరీక్ష

- రెండో రోజుకు చేరిన టెన్త్ ఎగ్జామ్స్

రామగిరి/సూర్యాపేట అర్బన్, మార్చి 19 : పదో తరగతి వార్షిక పరీక్షలు రెండో రోజు సజావుగా జరిగాయి. మంగళవారం హిందీ ఎగ్జామ్ నిర్వహించగా నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 19,249 మంది విద్యార్థులకుగానూ 19,198 మంది హాజరయ్యారు. డీఈఓ భిక్షపతితోపాటు జిల్లా ప్రత్యేక పరిశీలకుడు రమణ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ యూసుఫ్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 11,933 మంది విద్యార్థులకు 11,893 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తోపాటు స్క్వాడ్స్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు.


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

# నేత్రపర్వం..

## లక్ష్మి సమేతుడై విహరించిన నరసింహ స్వామి

## వైభవంగా గరుడ వాహన సేవ

# దివ్యవిమాన రథోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి19 : యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కల్యాణ లక్ష్మీ నరసింహ స్వామి దివ్య విమాన రథంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల పుష్పాలు, మామిడి, అరటి తోరణాలతో దివ్య విమాన రథాన్ని శోభాయమానంగా అలంకరించి, విష్వక్సేనుడికి తొలి పూజతో రథోత్సవాన్ని అరంభించారు. పట్టువస్త్రాలు, బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలతో కల్యాణ దంపతులైన లక్ష్మీనరసింహ స్వామిని అలంకరించి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ దివ్య విమాన రథంపై ఊరేగించారు. వేద పారాయణాలు, మూలమంత్ర పఠనాలతో రథాంగ హోమం పూజలు చేసి లక్ష్మీనరసింహ స్వామికి హారతి నివేదించారు. భక్తుల జయజయ ధ్వానాలు, మంగళ వాయిద్యాల నడుమ ఏక శిఖరవాసుడిని విహరింపజేసే ఘట్టాలు నేత్రపర్వంగా సాగాయి. స్వామి వారి రథోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దివ్య విమాన రథోత్సవాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, అర్చకులు, పారాయణికులు ఆగమశాస్త్ర రీతిలో నిర్వహించారు.

### సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. ఉదయం శబరి గిరీశ అయ్యప్ప భక్త బృందం, భాగ్యలక్ష్మి మహిళా భజన మండలి భజన కార్యక్రమాలు, వెంపరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసమూర్తి గారి శ్రీమత్ భాగవతాంర్గత నృసింహ తత్త్వం ఉపన్యాసం, శారద భాగవతారిణితో ధృవచరిత్ర హరికతా గానం నిర్వహించారు. సాయంత్రం శారద సంగీత విద్యాలయం వారి భక్తి సంగీత కార్యక్రమం, డాక్టర్ మోహన కృష్ణ గారి కర్ణాటక సంగీతం, కుమారి వైష్ణవి గోపాల్ గారి వీణావాద్యం, కుమారి విశ్వజ, విష్ణుజ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన, సమతుల్య యోగా కూచిపూడి డ్యాన్స్, ఆర్‌వీఎస్ఎన్‌వీ సోమయాజులు, వేదాంతం కూచిపూడి డ్యాన్స్ అకాడమీ, భరద్వాజ నాట్యాలయం, డాక్టర్ నవ్య నాగబండి, నాట్య మయూరి డ్యాన్స్ అకాడమీ వారి కూచిపూడి నృత్య పదర్శన, గడ్డం సుదర్శన్ చిందు యజ్ఞగానం కార్యక్రమాలు అలరించారు.


ఆలయ మాఢ వీధుల్లో స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం


మహా విష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై స్వామివారి సేవ

### విష్ణుమూర్తి అలంకారంలో..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ వేడుకలతో లక్ష్మీనాథుడైన నరసింహ స్వామి విష్ణుమూర్తి అలంకారంలో తన ఇష్ట వాహనమైన గరుత్మంతుడిపై ఆలయ తిరువీధుల్లో ఊరేగారు. అలంకార శోభితుడు లక్ష్మీనరసింహ స్వామిని వేద స్వరూపుడైన గరుడ వాహనంపై అధిష్టింప జేసి, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ సేవోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవ కల్యాణ నరసింహ స్వామి సన్నిధిలో నిత్యహవనం, వేద పారాయణాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, కార్యనిర్వహణాధికారి భాస్కర్ రావు, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, యాజ్ఞాచార్యులు కిరణ్‌కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు మంగళగిరి నరసింహ మూర్తి, ఉప ప్రధానార్చకులు సురేంద్రాచార్యులు, భాస్కరాచార్యులు, మాధవాచార్యులు, సహాయ కార్యనిర్వహణాధికారి గజవెల్లి రమేశ్‌బాబు, రఘు, గట్టు శ్రవణ్‌కుమార్, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### నేడు చక్రతీర్థం

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం 7 గంటలకు శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం నిర్వహించనున్నారు. కొండపైన ప్రత్యేకంగా నిర్మించిన విష్ణు పుష్కరిణిలో చక్రస్నానం జరిపించనున్నారు. అనంతరం భక్తులకు పుణ్యస్నానాలకు అనుమతి నివ్వనున్నారు.

## మహిళలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరిచందన


మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ, మార్చి 19 : ఓటు హక్కు కలిగిన ప్రతి మహిళా ఓటును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల స్వీప్ కార్యక్రమంలో భాగంగా టీటీడీసీలోని జిల్లా సమాఖ్య భవనంలో 'క్రమబద్ధమైన ఓటర్ల విద్య' అంశంపై మహిళా సంఘాలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే నెలలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి మహిళా ప్రలోభాలకు గురికాకుండా సరైన నాయకత్వాన్ని ఎన్నుకునేలా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సరైన నాయకుడిని ఎన్నుకుంటే మన భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. ఆలోచించి సమాజానికి ఉపయోగపడే వారికి ఓటు వేయాలని సూచించారు. నల్లగొండ జిల్లాలో పురుషుల కన్నా మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని, ఈ ప్రభావం ఎన్నికల్లో కనిపించాలని పిలుపునిచ్చారు. మహిళల్లో ఓటు చైతన్యం తీసుకొచ్చేందుకు స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఓటర్లను ప్రలోభ పెట్టినట్లు తెలిస్తే వెంటనే సీ-విజిల్ లేదా 1950 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల్లో ప్రతి ఓటు ముఖ్యమైనదని, అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును జాగ్రత్తగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీఆర్డీఓ నాగిరెడ్డి, జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి, అడిషనల్ డీఆర్డీఓ శారద పాల్గొన్నారు.

### క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలి

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు తనిఖీలను క్షుణ్ణంగా చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎఫ్ఎస్‌టీ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, ర్యాలీలకు, వాహనాల అనుమతులను పరిశాలించాలని సూచించారు. నగదు స్వాధీనం చేసుకుంటే సంబంధిత పోలింగ్ స్టేషన్‌లో సీసీటీవీ కెమెరా నియంత్రణలో ఉంచాలని, ఆ విషయాన్ని తక్షణమే జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీకి తెలియజేయాలని తెలిపారు. ఎస్ఎస్‌టీ బృందాలు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, చెక్‌పోస్టుల్లో అందుబాటులో ఉండాలని ఎస్పీ చందనా దీప్తి అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, టి.పూర్ణచందర్, డీఆర్‌డీఓ రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఏఆర్వోలు పాల్గొన్నారు.


ఎన్నికల నిబంధనలపై జిల్లా అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

## శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయొద్దు

- సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావ్

సూర్యాపేట, మార్చి 19 : జిల్లాలో లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వివిధ శాఖల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయొద్దని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్‌కు ముందు జరిగిన పనులు, కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత జరుగుతున్నవి, టెండర్ ప్రక్రియలో ఉన్న పనుల వివరాలను సత్వరమే అందించాలన్నారు. జిల్లాలో మోడల్ కోడ్ కండక్ట్ అమలులో ఉన్నదని, దీనిని అందరూ తప్పక పాటించాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధలనకు విరుద్ధంగా పనులు చేపడితే వారిని బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దటి రాకుండా చూడాలని, అందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఎఫ్ఓ సతీశ్, అయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


## 21, 22తేదీల్లో దక్షిణ తెలంగాణ వ్యవసాయ అధికారులు, రైతుల సమావేశం

నల్లగొండ, మార్చి 19 : నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో దక్షిణ తెలంగాణ వ్యవసాయ అధికారులు, రైతులు, శాస్త్రవేత్తల సమావేశం జరుగనుంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా ఈ సమావేశం నిర్వహిస్తున్నాయి. వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని సవరించే దిశగా పరిశోధనలు చేపట్టడం, సమస్యలకు పరిష్కారాలు, గత సంవత్సరం రైతులు లేవనెత్తిన అంశాలకు సాంకేతిక పరమైన పరిష్కారాలు తెలియజేయడంతోపాటు వ్యవసాయ విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతిని వివరించనున్నారు.

దీనికి వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో పాటు దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, 11 జిల్లాల రైతులు హాజరు కానున్నారు.

## నేతల్లో ఎన్నికల ఖర్చు గుబులు

- పార్లమెంట్ పోలింగ్‌కు రెండు నెలల సమయం
- అన్ని రకాలుగా పెరుగనున్న వ్యయ భారం
- ఈ సారి అభ్యర్థి ఖర్చు రూ. 50కోట్లకుపైనే..!
- ఖర్చుపై ఎన్నికల కమిషన్ ఫోకస్



యాదాద్రి భువనగిరి, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : ఎన్నికలు అంటేనే ఖర్చుతో కూడుకున్నది. కొన్నేండ్లుగా ఎన్నికలు కాస్ట్‌లీగా మారాయి. ఆడంబరాలు, విందులు, వినోదాలు, ప్రలోభాలు, పంపకాలు, ప్రచార ఆర్భాటాలు.. ఒకటా, రెండా.. ఇలా చెప్పుకొంటూ పోతే అనేకం. పోలింగ్‌కు ఇంకా రెండు నెలల సమయం ఉండటంతో అటు పార్టీలు, ఇటు అభ్యర్థులు, ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలలు ఉండటంతో ఖర్చు పెరిగి తడిసి మోపెడవుతుందని పరేషాన్ అవుతున్నారు. ఈ సారి ఎలక్షన్స్‌లో ఒక్కో అభ్యర్థి రూ. 50 కోట్ల దాకా ఖర్చు చేసేలా ప్లాన్ చేసుకుంటున్నారు. మరోవైపు ఎన్నికల ఖర్చుపై ఎన్నికల సంఘం ఫోకస్ పెట్టింది.

### డబ్బుతోనే అన్నీ..

పార్లమెంట్ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఇప్పటికే కోడ్ అమల్లోకి వచ్చింది. వచ్చే నెల 18న నోటిఫికేషన్ రానుంది. రాష్ట్రంలో నాలుగో విడుత కావడంతో మే 13న పోలింగ్ జరుగనున్నది. ఇప్పటి నుంచి సుమారు రెండు నెలల సమయం ఉంది. గతంతో పోలిస్తే ఇప్పటి ఎన్నికలు డబ్బులతోనే ముడిపడి ఉన్నాయి. విస్తృతంగా ప్రచారం చేయాలి. రెండు నెలల పాటు ఓటర్ల చుట్టూ తిరుగాలి. క్యాంపెయిన్ కోసం బూత్‌ల వారీగా ఖర్చులు భరించాలి. ప్రచారంలో మంది మార్బలం ఉండాలి. ప్రచార రథాలు, ఇతర వాహనాలు అందుబాటులో ఉంచాలి. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. కరపత్రాలు, బ్యాడ్జీలు, స్టిక్కర్లు అవసరం. గతంలో మాదిరి సమావేశాలకు ఉత్తగనే ఎవరూ రావడంలేదు. సమావేశం, సభకు రావాలంటే పెద్ద నోటు అప్పజెప్పాల్సిందే. కనీస రూ.200 నుంచి రూ.400 ముట్టజెపాల్సిందే. కేడర్‌ను కాపాడుకోవాలి. పార్టీ శ్రేణులకు పెట్రోల్, డీజిల్, భోజనాలు తదితర అవసరాలు తీర్చాలి. ఇలా రోజుకు రూ.లక్షల్లో ఖర్చు భరించాల్సి ఉంటుంది.

### ఖర్చుపై అంచనాలు

ఎన్నికలు ఖరీదుగా మారడంతో పార్టీలు, అభ్యర్థులు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దీంతో బరిలో నిలిచే అభ్యర్థులు, ఆశావహులు ముందుగానే డబ్బులు సిద్ధం చేసుకుంటున్నారు. ఆయా పార్టీల వారీగా ఎన్నికలకు ఖర్చు అంచనా వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి పరిస్థితులకు అనుగుణంగా రూ. 50 కోట్ల నుంచి రూ. 100 కోట్ల దాకా ఖర్చు చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు అసెంబ్లీతో పోలిస్తే ఓటర్లకు డబ్బుల పంపకం పరిమితిగా ఉంటుంది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో రూ. 50 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేసి, ఆ మేరకు ఫండ్స్ రెడీ చేసుకుంటున్నారు. ఇందులో కొంత పార్టీ భరించనుండగా, మరికొంత అభ్యర్థులు సొంతంగా అడ్జెస్ట్ చేసుకోనున్నారు. ఇప్పటికే కొందరు ఆయా చోట్ల డంప్ చేసే ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఇక అనుకున్న దాని కన్నా కొంత మేర అదనంగా ఖర్చు పెట్టే అవకాశాలు ఉన్నాయి.

### క్షేత్రస్థాయిలో ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి

ఎన్నికల్లో ఖర్చుపై ఎలక్షన్ కమిషన్ ఫోకస్ పెట్టింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేసేందుకు ప్లాన్ రూపొందించింది. ఇప్పటికే పార్లమెంట్ పరిధిలో 23ఫ్లయింగ్ స్క్వాడ్స్, 23 స్టాటిస్టికల్ సర్వేయల్ టీమ్‌లు, 9 వీడియో వీవింగ్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో పరిశీలిస్తాయి. అంతే కాకుండా పార్లమెంట్ పరిధిలో 23 పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఆధారాలు లేకుండా రూ. 50వేల కంటే ఎక్కువ నగదును రవాణా చేస్తే సీజ్ చేయనున్నారు. బంగారం, వెండి, ఇతర గిఫ్ట్‌ల రవాణాపై నిఘా పెట్టారు. అభ్యర్థులు నామినేషన్ వేసిన రోజు నుంచి ఖర్చు పరిగణనలోకి వస్తుంది. రాష్ట్రంలో అభ్యర్థి వ్యయ పరిమితి రూ. 95లక్షలుగా నిర్ణయించారు



మహిళా రైతుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

## డిమాండ్ ఉన్న పంటలే సాగు చేయాలి

- డీఏఓ శ్రవణ్‌కుమార్

నల్లగొండ, మార్చి 19 : వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై సరైన అవగాహన లేక పలువురు రైతులు నష్టాలను చవిచూస్తున్నారని, స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకొని మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలే సాగు చేయాలని డీఏఓ శ్రవణ్‌కుమార్ అన్నారు. ఇందుకుగాను అవసరమైతే మహిళా రైతుల కోసం ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా కేంద్రంలోని నల్లగొండ క్లబ్‌లో మంగళవారం సొప్పేకాం, మకాం మరియు గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో 'వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో మహిళా రైతులపై వ్యవస్థీకృత హింస' అంశంపై మహిళా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్, మార్కెటింగ్ సౌకర్యం ఉన్న వరి, పత్తి, వేరుశనగ వంటి పంటలను వేసుకుంటే మహిళా రైతులకు మేలు జరుగుతుందన్నారు. నీటి వసతిని బట్టి ఏ పంట వేయాలనేది ముందుగానే నిర్ణయించుకొని దానిపై తగిన అవగాహన పెంచుకోవాలని సూచించారు. కొత్త పంటలు వేసేటప్పుడు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలన్నారు. మార్కెటింగ్ సౌకర్యం ఉన్న పంటలను మాత్రమే వేసుకోవాలని, లేకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. సొంతంగా మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉంటేనే చిరు ధాన్యాలు సాగు సాగు చేయాలని సూచించారు. మహిళా రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోవద్దని, ఒక సీజన్‌లో ఇబ్బందులు ఎదురైనప్పటికీ మరో సీజన్ ఉంటుందనే విషయాన్ని మరిచిపోవద్దని అన్నారు. సమావేశంలో పలువురు మహిళా రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా.. వాటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీఏఓ తెలిపారు. గ్రామ్య రిసోర్స్ సెంటర్ నిర్వాహకురాలు రుక్మిణీరావు మాట్లాడుతూ జిల్లాలో మహిళా రైతుల పరిస్థితిపై సమగ్రంగా అధ్యయనం చేశామని, మహిళా రైతులు పడుతున్న కష్టాలను తెలుసుకున్నామని అన్నారు. వాటితోపాటు ఇక్కడ వ్యక్తమైన అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మహిళా రైతుల జీవితాలను బాగు చేయడానికి తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ చింత కృష్ణ, సభ్యుడు కిరణ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి, ఎంజీ యూనివర్సిటీ అధ్యాపకుడు మధు పాల్గొన్నారు.


తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ఎండిన వరి పొలం


# అడుగంటిన జలాలు.. ఎండుతున్న పొలాలు

- సాగు చేసిన వరిలో సగం కూడా చేతికందని పరిస్థితి
- తిరుమలగిరి మండలంలో రైతుల అవస్థలు


తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో ఎండిన మూడు ఎకరాల పొలంలో రైతు జాటోతు మాన్సింగ్

తిరుమలగిరి, మార్చి 19 : సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. చెరువులు వట్టిపోయి, భూగర్భ జలాలు అడుగంటడంతో భూములు నెర్రెలు బారుతున్నాయి. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. బోర్లు వేసినా నీళ్లు పడడం లేదు. కొందరు రైతులు ట్యాంకర్ల నీటి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎండిన వరి పొలాలను చేసేదేమీ లేక పశువుల మేతకు వదిలేస్తున్న దుస్థితి నెలకొన్నది. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని తొండ, తాటిపాముల, నందాపురం, నెల్లిబండ తండా, తిరుమలగిరి, జలాల్‌పురం, మామిడాల తదితర గ్రామాల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఈ యాసంగికి పెట్టిన పెట్టుబడి ఏమోగానీ నష్టాలను చవి చూడాల్సిన వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేండ్ల తర్వాత మళ్లీ కరువు చాయలు కనిపిస్తున్నాయని, ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### ఐదెకరాలు వేస్తే సగం ఎండింది



గత సంవత్సరం మాదిరిగానే ఈ యాసంగికి ఐదెకరాల్లో వరి సాగు చేసిన. గతంలో నిండుగా నీళ్లు పోసిన బోర్లు ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. నీళ్లు లేక ఐదెకరాల్లో సగం పొలం ఎండి పోయింది. చేతికి అందిన పంట కాపాడుకోవడానికి వరుస తడులు పెడుతున్నా ఫలితం ఉండటం లేదు.

– సోమేశ్, రైతు, తొండ గ్రామం

### రెండు బోర్లు వేసినా ఫలితం దక్కలేదు



యాసంగికి ఐదెకరాల్లో వరి సాగు చేసిన. నీళ్లు అందక రెండు ఎకరాలు గొర్రెలకు మేతగా వదిలేసిన. మిగిలిన మూడెకరాలకు వరుస తడులు పెడుతున్నా నీళ్లు అందడం లేదు. ఇటీవల పంటను కాపాడుకోవటానికి రెండు బోర్లు వేసినా నీళ్లు పడలేదు. కండ్ల ముందే వరి పొలాలు ఎండుపోతుంటే పాణం తరుక్కుపోతున్నది.

– బోయిని కొమరమల్లు, రైతు, తిరుమలగిరి

# మిల్లర్ల ఇష్టారాజ్యం

- తక్కువ ధరకే సన్న ధాన్యం కొనుగోలు
- జేసీ ఆదేశాలు బేఖాతరు

మిర్యాలగూడ, మార్చి 19 : యాసంగిలో రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందించాలని సోమవారం రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. అయినా.. రైస్ మిల్లర్ల తీరు మారలేదు. మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులను నష్టపరుస్తున్నారు. సన్న ధాన్యానికి రేటు పెట్టడం లేదు. సోమవారం సాయంత్రం వచ్చిన ధాన్యాన్ని మంగళవారం కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు రోడ్ల మీదనే ట్రాక్టర్లు పెట్టుకొని అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో కొందరు రైతులు విధిలేని పరిస్థితుల్లో మిల్లర్లు అడిగిన ధరకే అమ్ముకున్నారు.


మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి రోడ్డు వెంట ఉన్న మిల్లుల వద్ద రైతులు నిలిపి ఉంచిన ధాన్యం ట్రాక్టర్లు

ఈ యాసంగి సీజన్‌లో మహేంద్ర చింట్లు, కావేరి చింట్లు, హెచ్ఎంటీ రకాలైన సన్న ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి మిల్లర్లు పంటల కోతల సమయంలో క్వింటా రూ.2600 నుంచి రూ.2700 వరకు కొనుగోలు చేశారు. వారం రోజులుగా ధాన్యం ట్రాక్టర్లు మిల్లుల వద్దకు భారీగా వస్తుండడంతో మిల్లర్లు సిండికేట్‌గా మారి తక్కువ ధరకే అడుగుతున్నారు. క్వింటా రూ.2100 నుంచి రూ.2300 వరకే కొనుగోలు చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇష్టం లేకపోతే తీసుకుపో అని బెదిరిస్తున్నారు. రైతులు రాగానే మాకు ధాన్యం వద్దు అని మిల్లర్లు చెప్తున్నారు. రోజంతా పడిగాపులు కాసిన రైతులు విధిలేని పరిస్థితిలో బతిమిలాడుకొని అడిగిన కాడికి ఇచ్చిపోతున్నారు.

### అధికారుల పర్యవేక్షణ కరువు

కేసీఆర్ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాగానే మిర్యాలగూడలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందించేవారు. ఈ యాసంగి సీజన్ ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా ఇంతవరకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయలేదు. రైతులు రోడ్ల మీదనే ట్రాక్టర్లను నిలిపి ఇబ్బందులకు గురవుతున్నా కనీసం పట్టించుకునే వారు లేరు. అధికారులు మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి వెళ్తున్నారు. కానీ.. క్షేత్రస్థాయిలో పట్టించుకునేవారు లేకపోవడంతో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎన్నో కష్టాలకు ఓర్చి పంటలు పండించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

### పచ్చగింజ పేరుతో దోపిడీ..

యాసంగిలో వరి పొలాలను యంత్రాల ద్వారా కోయడం వల్ల ధాన్యంలో అక్కడక్కడ పచ్చ గింజ ఉంటుంది. దీన్ని సాకుగా చూపి క్వింటాకు రూ.200 నుంచి రూ.300 వరకు కోత విధిస్తున్నారు. కనీసం రూ.2500 ధర అందించాలని అధికారులు చెప్పినా రైస్ మిల్లర్లు మాత్రం పట్టించుకోవడం లేదు. సోమవారం తీసుకొచ్చిన ధాన్యం మంగళవారం కూడా కొనుగోలు చేయడం లేదని వేములపల్లి, త్రిపురారం మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం వెంటవెంటనే కొనుగోలు చేయకపోవడంతో ట్రాక్టర్ కిరాయి ఎక్కువవుతుందని చెప్తున్నారు.

### తక్కువ ధరకే అమ్ముకున్నా



బోరు ఆధారంగా ఐదెకరాల్లో సన్న ధాన్యం పండించా. మూడు ట్రాక్టర్లలో ధాన్యం తీసుకొని మిర్యాలగూడలో 15 మిల్లులు తిరిగిన. చివరికి విసిగి వేసారి నాణ్యంగా ఉన్న వడ్లను క్వింటాకు రూ.2300 చొప్పున అమ్ముకున్నా. ఇంత తక్కువ ధరకు అమ్మడం చాలా బాధగా ఉంది. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. అధికారులు రావడం లేదు. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రైతులను పట్టించుకునే వారే కరువయ్యారు. ఇంత అన్యాయం రైతులకు ఎన్నడూ జరుగలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా పట్టించుకొని రైతులకు గిట్టుబాటు ధర అందించేలా చూడాలి.

– ఎ.సైదులు, రైతు, త్రిపురారం